ప్రజాశక్తి
గురువారం 2 ఫిబ్రవరి 2023
5
శ్రీ సత్యసాయి



అందుబాటులోకి హైవే అంబులెన్స్‌లు

టోల్‌ఫ్రీ నెం:1033

అనంతపురం కలెక్టరేట్ : నేషనల్ హైవే రోడ్లలో ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులకు తక్షణ వైద్యసదుపాయాలు అందించేందుకు నేషనల్ హైవే సంస్థ అంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చింది. 1033 టోల్‌ఫ్రీ నెంబర్‌తో 9 ఆంబులెన్స్‌లను బుధవారం నాడు ఎన్‌హెచ్‌ఎఐ ప్రాజెక్టు డైరెక్టర్ జీవస్ లాల్ మీనాలి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారిపై ప్రమాదం జరిగిన 15 నుంచి 20 నిమిషాలలోపు ప్రమాద ప్రదేశానికి చేరుకోవాలని, గోల్డెన్ అవర్ సమయంలో వాటిని సమీప ఆసుపత్రికి తరలించడానికి ఉపయోగకరంగా ఆంబులెన్స్‌లను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. కర్నూలు జిల్లాలోని హాలహర్వి టోల్ ప్లాజా, అనంతపురం జిల్లాలోని జల్లిపల్లి, వడ్డుపల్లి టోల్ ప్లాజాలు, శ్రీ సత్యసాయి జిల్లాలోని బత్తలపల్లి, యర్రదొడ్డి, చోళసముద్రం టోల్ ప్లాజాల వద్ద ఈ ఆంబులెన్స్‌లు ఉంటాయన్నారు. నేషనల్ హైవేలో ప్రమాదం జరిగితే వెంటనే 1033కు కాల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీం లీడర్లు సుబ్రమణ్యం, అసిస్టెంట్ మేనేజర్లు ఎం. నాగ హాషీకేష్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఈ సారీ నిరాశే మిగిలింది. బడ్జెట్ ప్రవేశపెట్టిన ప్రతిసారీ కరువు జిల్లాకు కేంద్రం ఏదోసాయం చేస్తుందని ఆశ పెట్టుకోవడం, తీరా చూస్తే ఎలాంటి కేటాయింపులు లేకుండా ఉసూరుమనిపించడం పరిపాటిగా మారుతోంది. బిజెపి పాత మోసాన్నే మళ్లీ జిల్లాకు చేసింది. బుధవారం నాడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతీరామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మరోమారు జిల్లాకు మొండి చేయి చూపించారు. కేంద్ర బడ్జెట్‌లో వెనుకబడిన ప్రాంతాలకు నిధుల కేటాయింపులు ఆశించినంత జరగలేదు. దీంతో జిల్లావాసులకు మరోమారు తీరని నిరాశే మిగిలింది.



ఈసారీ నిరాశే..

- కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు నామమాత్రపు కేటాయింపు
- కేంద్రీయ విశ్వవిద్యాలయానికి రూ.47 కోట్లు
- 'భద్ర'కు నిధులు... హంద్రీనీవాకు లేవు..





ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2023-24 బడ్జెట్‌లో కేంద్రీయ విశ్వవిద్యాలయానికి ఎప్పటిలాగానే అరకొర నిధులనే కేటాయించింది. ఇక రైల్వేకు సంబంధించి కొత్త రైళ్లు ఏవీ రాలేదు. గుంతకల్లు డివిజన్‌కు ఎన్ని నిధులు కేటాయించారన్నది ఇంకా స్పష్టత రాలేదు. పింకు బుక్కు వస్తే డివిజన్ పరిధిలో నిధుల కేటాయింపులపై ఒకటి, రెండు రోజుల్లో స్పష్టత రానుంది. ఏది ఏమైనా ఈ బడ్జెట్‌లో వెనుకబడిన అనంతపురం జిల్లాకు అన్యాయమే మిగిల్చిందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కేంద్రీయ విశ్వవిద్యాలయానికి మొండి చేయి

విభజన హామీలో భాగంగా అనంతపురం జిల్లాలో ఏర్పాటైన కేంద్రీయ విశ్వవిద్యాలయానికి ఈ ఏడాది నిధుల కేటాయింపులు మొక్కుబడిగానే జరిగాయి. గతేడాది కూడా కేటాయించినది తక్కువే అయినా అందులోనూ విడుదల చేసింది మరింత తక్కువనే చెప్పాలి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో కేంద్రీయ విశ్వవిద్యాలయానికి రూ.56.6 కోట్లు కేటాయించారు. కాని సవరణ బడ్జెట్‌లోకి వచ్చే సరికి ఆ నిధులు కేవలం 13.08 కోట్లకు తగ్గిపోయాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికి చూస్తే రూ.47.40 కోట్లు కేటాయించారు. ఇందులో విడుదలయ్యేది ఎంతన్నది ప్రశ్నార్థకమనే చెప్పాలి. ఇప్పటికే కనీస మౌలిక సదుపాయాలు కూడా లేక విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. అయినా ప్రభుత్వం కేంద్రీయ విశ్వవిద్యాలయానికి నిధుల కేటాయింపులు జరపకపోవడం గమనార్హం.

పక్కనున్న భద్రకు రూ.5300కోట్లు కేటాయింపు...

జిల్లాకు పక్కనున్న కర్నాటక రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి పేరుతో తుంగభద్ర డ్యామ్‌పై కర్నాటక నిర్మిస్తున్న భద్ర డ్యామ్‌కు రూ.5300 కోట్లు నిధులను కేటాయించింది. తుంగభద్రపై జరుగుతున్న ఈ నిర్మాణాలపై ఆంధ్రప్రదేశ్‌లో అభ్యంతరాలున్నాయి. ప్రధానంగా తుంగభద్ర డ్యామ్‌పై ప్రాజెక్టులు నిర్మాణం చేపడితే వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సమయంలో నీరు రావడం ఆలస్యమయితే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీటి విడుదలపై ప్రభావం పడుతుంది. ఇది ఆలస్యమయితే అనంతపురం జిల్లాకు తాగునీటి ఇక్కట్లు తప్పవు. ఇటువంటి ప్రాజెక్టుకు కర్నాటక ప్రభుత్వం నిధులు కేటాయించింది. అయితే ఇదే సమయంలో అనంతపురం జిల్లాకు మరోరూపంలో నీరందించే హంద్రీనీవాను పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గుంతకల్లు రైల్వే డివిజన్‌కైనా నిధులు పెరిగాయా ?

దక్షిణ మధ్య రైల్వేలో ప్రధానమైన డివిజన్‌లో గుంతకల్లు ఒకటి. దీనికి నిధుల కేటాయింపులు ఏ మేరకన్న దానిపై స్పష్టత లేదు. కొత్త రైళ్లు అయితే ఏవీ ఈ ప్రాంతానికి కేటాయించలేదు. ఇక అభివృద్ధికి నిధులు ఎన్ని కేటాయించారన్నది స్పష్టత రావాలంటే పింక్ బుక్ రావాల్సి ఉంటుంది. అది వస్తేగానీ ఈ ప్రాంతంలో కొత్తలైన్లు, పాత లైన్లకు నిధులు ఎన్ని కేటాయించారన్నది తెలియదు.

ఎపికి తీరని అన్యాయం

- టిడిపి జిల్లా కార్యదర్శి, సామకోటి ఆదినారాయణ,

పుట్టపర్తి అర్బన్ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని ఎపి పట్ల సవతి తల్లి ప్రేమను చూపిందని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ విమర్శించారు. త్వరలో ఎన్నికలు జరిగే కర్నాటకలో పాటు బిజెపి పాలనలో ఉన్న ఇతర రాష్ట్రాలకు బడ్జెట్‌లో ఎక్కువ నిధులు చూపించారన్నారు. రైతులకు కొత్తగా బ్యాంకు రుణాలు, ఎరువులు, పురుగుల మందులు పంటల బీమా ఏపీలోని ఇరిగేషన్ ప్రాజెక్టులకు నిధులు కేటాయింపులు లేవన్నారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు బడ్జెట్లో కేటాయింపులు లేవని మొత్తం మీద ఏపీకి అన్యాయం జరిగిందని ఆయన విమర్శించారు.

ఉపయోగం లేని బడ్జెట్ : యుటిఎఫ్

ధర్మవరం టౌన్ : వేతన జీవులకు ఎలాంటి ఉపయోగం లేని బడ్జెట్‌ను కేంద్రం ప్రవేశపెట్టిందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జయచంద్రారెడ్డి, కార్యదర్శి నాగేంద్ర విమర్శించారు. ఈ మేరకు వారు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొఠారి కమిషన్ విద్యారంగానికి జీడీపీలో 6 శాతం నిధులు కేటాయించాలని చెప్పినా ప్రస్తుత బడ్జెట్లో జీడీపీలో 3శాతం మొత్తం బడ్జెట్ లో 25 శాతం మాత్రమే కేటాయించడం అన్యాయమన్నారు. గత ఏడాది బడ్జెట్ తో పోల్చుకుంటే 0.12 శాతం పెరిగినట్టు అనిపిస్తున్న ఈ నిధులు విద్య, ప్రభుత్వరంగంలో నిర్వహించడానికి ఏ మాత్రం సరిపోవన్నారు. విద్యారంగానికి అరకొర నిధులు కేటాయింపు చేయడం ద్వారా విద్యాబాధ్యత నుండి ప్రభుత్వం తప్పుకున్నట్టు అర్థమవు తుందన్నారు. శాస్త్రసాంకేతిక రంగాలకు బడ్జెట్ లో 2శాతం నిధులు కేటాయించాలని అయితే ప్రస్తుతం 0.7శాతం మాత్రమేకేటాయించడం ద్వారా శాస్త్రీయ ఆలోచన కలిగిన విద్యార్థుల్ని తయారు చేయడానికి అవరోధం ఏర్పడుతుందని విమర్శించారు. వేతన జీవులకు బడ్జెట్లో పన్ను మినహాయింపు ఉంటుందని సేవింగ్స్ రూ.3లక్షలుగా ఉంటుందని ఆశించిన వారికి తీవ్ర నిరాశ కల్గిందన్నారు. రూ. 7 లక్షలలోపు మినహాయింపు అనేది కొత్త పన్ను విధానానికి మాత్రమే వర్తిస్తుందని ఇదే ఏ మాత్రం ఉపయోగపడదని అన్నారు. బడ్జెట్లో ఆమోదం పొందేలోపు పన్ను మినహాయింపు రూ.5లక్షలకు సవరించాలని, సేవింగ్స్ పెంచాలని శాస్త్ర సాంకేతిక రంగాలకు నిదులు కేటాయించి ప్రభుత్వ పరిశోధనలు ప్రోత్సాహించాలని కోరారు.

వైసిపి పాలనలో పెరిగిన భూకబ్జాలు



విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశ్వరరావు

- 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చాక అన్ని ప్రాంతాల్లోనూ మితిమిరీన భూకబ్జాలు పెరిగాయని సిపిఎం రాష్ట్ర కార్యవర్గదర్శి సభ్యులు వెంకటేశ్వరరావు విమర్శించారు. బుధవారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసిపి అధికారంలోకి వచ్చాక మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఆ పార్టీ నాయకులు దర్జాగా కబ్జా చేస్తూ భూవ్యాపారాలకు తెరలేపారన్నారు. లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములను అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కబ్జాలు చేశారన్నారు. ప్రభుత్వ భూములు అన్నింటినీ ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలన్నారు. కబ్జా చేసిన భూములను రెండవ విడత భూపంపిణీ కింద పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అభివద్ధి, పరిశ్రమలు, జాతీయరహదారుల పేరిట ఎన్నో ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూములకు సంబంధించి రైతులకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా ప్రభుత్వం బలవంతంగా తీసుకుంటోందన్నారు. 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయకుండా భూములను లాక్కొంటున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల పరిగిలో జాతీయ రహదారి నిర్మాణం పేరుతో పేదలు ఇళ్లను తొలగించి వారిని రోడ్డు పాలుజేశారన్నారు. పేదలను రోడ్డుమీద పడేయడమే జగన్ పాలనా అని ప్రశ్నించారు. ఇక కేంద్రంలోని బిజెపి సైతం పేదల సంక్షేమాన్ని గాలికొదిలేసి పాలన సాగిస్తోందన్నారు. ప్రత్యేక హోదా, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామన్న బీజేపీ నేటికీ ఒక్క రుపాయి కూడా కేటాయించలేదన్నారు. బీజేపీకి వైసీపీ భయపడి రాయలసీమ ప్రాంతాలకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. సిఎం జగన్ విశాఖను రాజధానిగా చేయడంతో రాయలసీమ ప్రాంతం ఎడారిగా మారే అవకాశం ఉందన్నారు. ఉత్తరాంధ్ర వెనుకబడటానికి కారణం ప్రస్తుత పాలక పెద్దలే అన్నారు. జగనన్నకాలనీల్లో గహాలకు కేరళ రాష్ట్రం మాదిరిగా రూ.6లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూసమస్యలు, చేనేత సమస్యలు, గిట్టుబాటుధర కల్పించాలనే తదితర అంశాలపై సిపిఎం ఆధ్వర్యంలో భవిష్యత్తులో పెద్దఎత్తున ఆందోళన చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, సిఐటియు జిల్లా నాయకురాలు దిల్షాద్, సిపిఎం పట్టణ కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, నాయకులు ఎస్‌హెచ్.బాషా, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నామాల నాగార్జున పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావడం అభినందనీయం



హిందూపురంలో ప్రశంసాపత్రం అందుకుంటున్న ఉద్యోగులు



కదిరిలో ప్రశంసాపత్రం అందుకుంటున్న ఉద్యోగులు

హిందూపురం : ఆర్‌టిసి కార్మికులు రక్తదానం చేయడానికి ముందుకు రావడం అభినందనీయమని మున్సిపల్ వైస్ ఛైర్మన్ జబివుల్లా పేర్కొన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా ఆర్‌టిసి డిపో మేనేజర్ డాక్టర్ శ్రీనివాసరావు, ఆర్‌టిసి వైద్యురాలు అపర్ణ ఆధ్వర్యంలో కార్మికులతో డిపో ఆవరణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేశారు. రక్తదానం చేసిన కార్మికులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉమర్ ఫారూఖ్ ఖాన్, అసిస్టెంట్ మేనేజర్ హంపన్న తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంలో ముందు వరుసలో కదిరి డిపో ఉద్యోగులు

కదిరి టౌన్ : రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా జిల్లాలో నిర్వహించిన రక్తదానంలో కదిరి డిపో ఉద్యోగులు ముందు వరుసలో నిలిచారని డిపో మేనేజర్ మైనుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ప్రజా రవాణా అధికారి మధుసూదన్ నేతృత్వంలో హిందూపురంలో జరిగిన రక్తదాన కార్యక్రమంలో కదిరి డిపో నుండి 19 మంది కండక్టర్లు, డ్రైవర్లు, గ్యారేజి సిబ్బంది వెళ్ళి రక్తదానం చేశారన్నారు. రక్తదానం కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులను కదిరి డిపో మేనేజరు బి.మైనోద్దీన్, అసిస్టెంట్ మేనేజరు హరిమోహన్ బుధవారం అభినందనలు తెలిపి ప్రశంసాపత్రాలు, మెమోంటోలు అందజేశారు. అదే విధంగా అరుణాచలానికి ఒక పూర్తి బస్సును స్వచ్ఛందముగా బుక్ చేయించి, కదిరి డిపోఅభివృద్ధికి సహకరిస్తున్న ఉత్తమ సూపర్వైజరు ఉత్తన్న సేవలను డిపో మేనేజరు ఈసందర్భంగా కొనియాడారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో 'పురం' విద్యార్థుల ప్రతిభ



ప్రతిభా విద్యార్థులతో కరాటే మాస్టర్లు

ప్రజాశక్తి - హిందూపురం

జనవరి 29 నుంచి 30వ తేదీ వరకు ఒంగోల్‌లోని మిని స్టేడియంలో జరిగిన అండర్ 14, అండర్ 17, 19 విభాగాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే స్కూల్ గేమ్స్ సెలెక్షన్స్‌లో హిందూపురం విద్యార్థులు మంచి ప్రతిభ కనబర్చినట్లు కరాటే మాస్టర్ ఫైరోజ్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్ర స్థాయి కరాటే స్కూల్ గేమ్స్‌లో భాగంగా ఉభయ జిల్లాల నుంచి ఎంపికైన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఇందులో పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తమ వద్ద శిక్షణ తీసుకున్న వారిలో ఆల్ అమీన్ పాఠశాలకు చెందిన బరీర, వెలాంగినీ, మాత పాఠశాలకు చెందిన లోకేష్ ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ముదిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన రియాజ్, సయ్యద్ ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. ఎల్ఆర్‌జి పాఠశాలకు చెందిన కార్తీక్, వెలాంగిణి మాతా స్కూల్‌కు చెందిన మహేంద్ర తృతీయ స్థానంలో నిలిచారన్నారు. ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను జాతీయ స్థాయిలో పోటీలకు ఎంపికైయినట్లు ఫైరోజ్ తెలిపారు.

కార్యాలయాన్నే నివాసంగా మార్చిన ఎఓ

ముఖ హాజరుకు సిబ్బందికి ఇబ్బందులు

ప్రజాశక్తి మడకశిర రూరల్

అగళి మండల వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న శ్రీరామ్ నాయక్ తన కార్యాలయాన్నే నివాసంగా మార్చేశాడు. దీంతో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగికి ఇబ్బందిగా మారింది. మహిళా ఉద్యోగులు ముఖ హాజరు వేయాలంటే కార్యాలయం బయటే వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆ అధికారి ఉదయం కార్యాలయం పనివేళల్లో ముఖ హాజరు వేసిన తర్వాత స్నానం చేసి ఆ తర్వాత విధులకు హాజరవుతుంటాడు. దీంతో అటు మహిళా ఉద్యోగులకు, ఇటు ప్రజలకు అసౌకర్యం ఏర్పడిందని పలువురు విమర్శిస్తున్నారు. ఈ విషయాన్ని ప్రజలు గతంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం కలగలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ విషయంపై స్థానిక వ్యవసాయ అధికారి శ్రీరామ్ నాయక్‌ను వివరణ కోరగా నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చారు. ఇలా కార్యాలయంలోనే నివాసం ఉండవచ్చునని అన్నారు. అయినా ఇది తన స్వంత విషయమని తనకు ఇష్టం వచ్చినట్టు ఉంటానని అడగడానికి సంబంధం లేదని నిర్లక్ష్యపు సమాధానం ఇచ్చారు. తాను 24 గంటలు కార్యాలయానికి భద్రతగా ఉంటానని అందువల్ల తనను ప్రశ్నించే అధికారం లేదని అన్నారు.



కార్యాలయంలో నే పడక ఏర్పాటు చేసుకుంటున్న వ్యవసాయశాఖ అధికారి



సచివాలయం వద్ద పింఛన్లు తీసుకుంటున్న లబ్ధిదారులు

సచివాలయం వద్ద పింఛన్ల పంపిణీ

ఇబ్బందుల్లో వృద్ధులు

ప్రజాశక్తి రొద్దం

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటివద్దకే పింఛన్లు పంపిణీ కార్యక్రమం రొద్దం మండలంలో అమలు కాలేదు. మండలంలోని ఎం. కొత్తపల్లి సచివాలయం వద్దనే పింఛన్ల పంపిణీ చేపట్టారు. సచివాలయం పరిధిలో ఉన్న నాలుగు వాలెంటీర్ల పోస్టులు ఖాళీ కావటంతో సమస్య ఏర్పడినట్లు తెలుస్తోంది. ఎం.కొత్తపల్లి గ్రామంలో ఇద్దరు, తోడంగి పల్లి గ్రామంలో ఇద్దరు వాలెంటీర్లు వదిలేయడంతో ఎం. కొత్తపల్లి గ్రామంలో ఉన్న ఇద్దరు వాలెంటీర్ల కింద ఉన్న దాదాపు 100 కుటుంబాల్లో ఉన్న పింఛనుదారులు ఆరు నెలలుగా సచివాలయం వద్దకే వచ్చి పింఛన్లు తీసుకు వెళ్తున్నారు. నడవడం చేతకాని వికలాంగులు, వృద్ధులు ఈ సందర్భంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు ఆరు నెలలుగా ఇదే సమస్యను ఎదుర్కొంటున్నామని వాపోయారు. ఇళ్లవద్దకే వచ్చి పింఛన్లు ఇస్తున్నప్పుడు ఎలాంటి సమస్య ఉండేది కాదని అన్నారు. ఇప్పటికైనా ఖాళీగా ఉన్న వాలెంటీర్ల పోస్టులను భర్తీ చేసి సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డెంటల్ క్లీనిక్ ప్రారంభం

కొత్తచెరువు : మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ లక్ష్మీ రాజ్ డెంటల్ క్లినిక్‌ను తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్లీనిక్‌ను ఏర్పాటు చేసిన డాక్టర్ రాజశేఖర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు కొట్టాల శ్రీరాములు, మల్లికార్జున, ఆరోవార్డు ఇన్‌ఛార్జి బేకరీ నాయుడు, సుధాకర్, దాదాపీర్ తదితరులు పాల్గొన్నారు.

దళితవాడలో రోడ్డు ఏర్పాటుకు చర్యలు

కెవిపిఎస్ ఆందోళనకు స్పందించిన కమిషనర్

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘంలోని 2వ వార్డు చౌడేశ్వరి కాలనీలోని దళిత వాడలో రోడ్డు ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. సమస్యను పరిష్కరించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. స్పందించిన కమిషనర్ బుధవారం జెసిబి ఏర్పాటు చేసి రోడ్డులో ఉన్న మొక్కలను తొలగించి, రోడ్డు పనులను చర్యలు తీసుకున్నారు. స్పందించి రోడ్డు పనులను చేపట్టిన కమిషనర్‌కు కెవిపిఎస్ నాయకులు, దళితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు నారాయణప్ప, కదిరప్ప తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

బాధితుడికి ఆర్థికసాయం

కదిరి టౌన్ : కదిరి పట్టణానికి చెందిన చాంద్ రెండు రోజుల క్రితం జిమాన్ సర్కిల్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయాన్ని బత్తల యువసేన నాయకులు వైఎస్ఆర్సిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన హరిప్రసాద్ బాధితుడుని మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించడానికి సహకరించారు. గాయపడిన చాంద్కు తన తండ్రి, మాజీ సర్పంచ్ వెంకటరమణ ద్వారా 10వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్నం శామీర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


బాధితుడికి ఆర్థికసాయం అందజేత

జాతీయస్థాయి పోటీలకు 'మంగళకర' విద్యార్థి

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని జగరాజు పల్లి మంగళకర విద్యాసంస్థలకు చెందిన విద్యార్థి జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. మంగళకర డిగ్రీ కళాశాలలో బిబిఎ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పి. అరవింద్ తమిళనాడులోని పెరియార్ యూనివర్సిటీ సేలంలో ఈ నెల నాలుగవ తేదీ నుండి 8వ తేదీ వరకు నిర్వహించే ఇంటర్ యూనివర్సిటీ హ్యాండ్ బాల్ టోర్నమెంట్కు ఎస్కే యూనివర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ జట్టుకు ఎంపికైనందున మంగళకర కరస్పాండెంట్ సురేష్ కుమార్, ఏవో జయచంద్రారెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రమేష్ బాబు, పీడీ శ్రీనివాసులు, అధ్యాపకులు అరవింద్ను అభినందించారు.

అంగన్వాడీ కేంద్రాల తనిఖీ

తలుపుల : తలుపుల 1, కోట 3, కుమ్మరిపేట 4 అంగన్వాడీ కేంద్రాలను కదిరి సిడిపిఒ రాధిక బుధవారం తనిఖీ చేశారు. ప్రీస్కూల్ పిల్లలకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాలలో 6 నెలల పూర్తయిన పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. పిల్లలకు అనుబంధ పోషకాలు, తల్లులకు, గర్భిణులకు పౌష్టికాహారం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించాలని సూచించారు. అనంతరం పిల్లల హాజరు పట్టిక, స్టాకు రిజిస్టర్ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ నిహారిక, అంగన్వాడీలు సుశీల, లక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పంటరుణాల రెన్యువల్

ఆమడగూరు : సహకార బ్యాంకులో పంట రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రెన్యువల్ చేసి వడ్డీ రాయితీ పొందాలని ఆమడగూరు సహకార బ్యాంక్ అధ్యక్షులు బొమ్మిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి, సిఇఒ. పద్మనాభరావు కోరారు. ఈసందర్భంగా వారు బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆమడగూరు సహకార బ్యాంకులో ఖరీఫ్ పంట రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రెన్యువల్ చేస్తే వడ్డీ రాయితీ వర్తిస్తుందన్నారు. రైతులు ఆయా గ్రామ సచివాలయాలలో ఎన్ బి నకలు, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డుతో వచ్చి వడ్డీ చెల్లించి తమ రుణాలను రెన్యువల్ చేసుకోవాలని కోరారు.

ముగిసిన కల్యాణోత్సవం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని మార్కండేయస్వామి దేవాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న భద్రావతి భావనా ఋషీంద్రుల కల్యాణోత్సవాలు బుధవారం ముగిశాయి. చివరి రోజు బుధవారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది కుల బాంధవుల మధ్య వసంతోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయదాతలుగా పోలం కృష్ణమూర్తి, అండన్ శ్యామల, సేపూరి కృష్ణయ్య మరియు కుమారులు, జింక కంబూరి మరియు కుమారులు తదితరులు వ్యవహరించారు. సాయంత్రం శయనోత్సవ కార్యక్రమాన్ని సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పద్మశాలీయ బహుత్తమ సంఘం అధ్యక్షుడు జక్కా చిన్న సింగరయ్య, ఉపాధ్యక్షులు జింకారామాంజి నేయులు, ప్రధానకార్యదర్శి జింకాచిన్నప్ప, కోశాధికారి పోరాళ్లపుల్లయ్య, హాయకార్యదర్శి బొడగల శంకర్, గోళీ నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి

ఓబులదేవరచెరువు : మండల కేంద్రంలో నిరుపేదలకు ఇంటిస్థలం ఇవ్వాలని కోరుతూ సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం వేమయ్య డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి పేదవానికి ఇంటి పట్టాతో పాటు పక్కాగృహాలు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి డి.ఆంజనేయులు, మండలకార్యదర్శి చలపతి, గ్రామస్తులు పాల్గొన్నారు .

స్టడీ మెటీరియల్ పంపిణీ అభినందనీయం

హిందూపురం : పట్టణంలో వివిధ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉర్దూ మాధ్యమ ఉపాధ్యాయులు ఉర్దు టీచర్స్ అసోసియోషన్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక స్టడీ మెటీరియల్ రూపొందించి, దానిని అన్ని పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేయడం అభినందనీయమని ఎంపిడిఒ నరేంద్ర, ఎంఇఒ గంగప్పలు పేర్కొన్నారు. బుధవారం పఠాన్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో సిపిఐ కాలనీలోని కెజిబివి మైనార్టీ బాలికల పాఠశాలలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు 10వ తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్, తెలుగు మీడియంలో స్టడీ మెటీరియల్ పట్టణంలో లభమవుతాయన్నారు. అయితే ఉర్దు మెటీరియల్ దొరకదని గుర్తించి ఉర్దు ఉపాధ్యాయులు స్టడీ మెటీరియల్ సిద్ధం చేసి, వాటిని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాల విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఉర్దు టీచర్స్ అసోసియేషన్ నాయకులు, ఉపాధ్యాయులు ఐనుద్దీన్, అన్సార్, రియాజ్, పాఠశాల ప్రిన్సిపల్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి

కదిరి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్ధారెడ్డి సూచించారు. పట్టణంలోని దత్త గార్డెన్స్, కుమ్మరవాండ్లపల్లి దారుల్ సలాం ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో వైసిపి గృహ సారథులకు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం మం నిర్వహించారు. రూరల్ మండలానికి చెందిన గృహ సారథులకు, సచివాలయ కన్వీనర్లకు, వాలంటీర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ నుండి జెసిఎస్ మండల ఇన్ఛార్జితో సచివాలయ కన్వీనర్లు సమన్వయంతో వాలెంటీర్ పరిధిలో గల ఇద్దరు గృహ సారథులు వాలంటీర్ తో కలిసి జగనన్న చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు ఏ విధంగా చేరువయ్యాయో తెలుసుకోవాలన్నారు. లబ్ధిదారులు జగనన్న చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలకు సంతప్తి చెందినట్లయితే ఒక వీడియోను మండల జెసిఎస్ గ్రూప్లో అప్లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. అర్హత కలిగిన ఎవరికైనా సంక్షేమ పథకాలు అందని పక్షంలో ఆ వివరాలను కనుక్కొని ఆ పథకాలు ఎందుకు వర్తించలేదో వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రాధాబాయి, ఎంపీపీ అమర్నాథ్ రెడ్డి, జెఎ ఎస్ మండల ఇన్ఛార్జులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుడిబండలో మారెమ్మ విగ్రహ ప్రతిష్టాపన

గుడిబండ : గుడిబండలో తుమ్మల మారెమ్మ విగ్రహ త్రపిష్టాపన కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. కర్నాటక రాష్ట్రం తుమకూరు జిల్లా సిద్ధర బెట్ట పీఠాధిపతి శ్రీశ్రీ వీరభద్ర శివాచార్య మహా స్వామీజీ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి కరుణాకర్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ జిబి శివకుమార్, సుధాకర్తో పాటు పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు

ప్రభుత్వానికి పేదలు కనిపించలేదా..?


సత్యగ్రహ దీక్ష వద్దకు ర్యాలీగా వస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్,తదితరులు

- సెంటు స్థలం ఇవ్వాలని అడుగుతున్నా పట్టించుకోని పరిస్థితి
- భూమాఫియాకు మాత్రం అన్ని విధాలా సహకారం
- ప్రభుత్వం ప్రజల పక్షమా... ధనవంతుల పక్షమా తేల్చుకోవాలి..
- జిల్లాలో అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి
- సత్యాగ్రహ దీక్షలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

'ఏళ్ల తరబడి నిరుపేదలు సెంటు స్థలం లేక అద్దె ఇళ్లల్లో నివాసం ఉంటున్నారు. ఎక్కడైనా కాలువల పక్కనో, వంకల పక్కనో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుని జీవిస్తుంటే వాటికి ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి ప్రభుత్వానికి చేతులు రావడం లేదు. పైగా వాటిని రాత్రికిరాత్రే కూల్చివేస్తున్నారు. అదే కబ్జాదారులు ప్రభుత్వ భూములను యథేచ్ఛగా కబ్జా చేస్తున్నా ఎవరూ పట్టించుకోరు. రాష్ట్ర ప్రభుత్వానికి పేదలు కన్పిస్తున్నారా.? లేదా.? అన్న సందేహం వ్యక్తం అవుతోంది.' అంటూ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని నిరుపేద కుటుంబాలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని, సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట 30 గంటల సత్యాగ్రహం చేపట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప అధ్యక్షతన నిర్వహించిన సత్యాగ్రహ దీక్షకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలు ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం రోడ్లు ఎక్కే దుస్థితిని ప్రభుత్వమే కల్పించడం అన్యాయంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన మోహన్‌రెడ్డి ప్రతి పేదవాడికీ ఇళ్లు ఇచ్చామంటు ఉదరగొట్టడమే తప్పా, చేతల్లో అమలు చేసింది ఏమీ లేదన్నారు. భూకబ్జాదారులు మాత్రం వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను అప్పనంగా కబ్జా చేసి భూ మాఫియా రాజ్యంగా మార్చేశారన్నారు. ప్రజల భూములను కూడా బెదిరించి తక్కువ ధరలతో లాక్కొని అదే భూములను జగనన్న కాలనీలకు అధిక ధరలకు విక్రయించి కోట్ల రూపాయలు కొల్లకొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు సెంటు భూమి ఇవ్వడానికి చేతులు రాని పాలకులకు కబ్జాదారులకు మాత్రం వేలాది ఎకరాలను ధారాధత్తం చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో ధనవంతులను ప్రోత్సహిస్తూ పేదలను నట్టేముంచుతున్న నరేంద్ర మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ముఖ్యమంత్రి బిజెపికి మోకరిల్లడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో అదానీ గ్రూప్‌కు వేలాది ఎకరాలు సోలార్ పవర్ కోసం అప్పగించేసిందన్నారు. రైతులకు మాత్రం తక్కువ ధర ఇచ్చి సాగు భూములను బలవంతంగా లాక్కొంటోందని చెప్పారు. వైసిపి ప్రభుత్వం పేదల పక్షమో.. పెద్దల పక్షమో తేల్చుకోవాలన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సత్యాగ్రహం ముగిసేలోపు అనంతపురం జిల్లాలో పేదలందరికీ ఇళ్ల పట్టాలు, గృహాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సాగు చేసుకుంటున్న వారికి సాగు పట్టాలు ఇవ్వాలన్నారు. జగనన్న ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేయాలన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వం, అధికారుల్లో స్పందన రాకుంటే రాష్ట్ర స్థాయిలో పోరాటం చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. పశ్చిమ రాయలసీమ పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు మాట్లాడుతూ దేశం, రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలు పరిపాలన చేస్తున్నాయని తెలిపారు. దేశాన్ని కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టేందుకు మోదీ ప్రభుత్వం పూనుకుందన్నారు. జాతీయ సంస్థలన్నింటినీ ప్రయివేటీ కరిస్తోందన్నారు. దీనిని ప్రశ్నించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సాగిలాపడి ప్రజలకు నష్టం చేస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి చిత్తశుద్ధి చాటుకోవాలన్నారు. అనంతరం సత్యాగ్రహ దీక్షా శిబిరం వద్దనే వంటా-వార్పు కార్యక్రమం నిర్వహించి రోడ్డుపైనే శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు పేదలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం అనంతపురం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, ఎస్.నాగేంద్రకుమార్, బి.శ్రీనివాసులు, ఓ.నల్లప్ప, నాయకులు ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, తరిమెల నాగరాజు, ఎం.క్రిష్ణమూర్తి, వై.వెంకటనారాయణ, నగర కార్యదర్శులు వి.రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు, ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, నాగమణి, రామాంజినేయులు, ముర్తుజా, గోపాల్, ముస్కిన్, వలి, మసూద్, బాబు, ప్రకాష్‌రెడ్డి, శివప్రసాద్, రామాంజినమ్మ, జగన్‌మోహన్‌రెడ్డి, రాజారామిరెడ్డితో పాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పేదలు పాల్గొన్నారు.


సత్యగ్రహ నిరసనలో భాగంగా దీక్షాశిబిరం వద్ద వంటావార్పు చేసి, రోడ్డుపై సహపంక్తి భోజనం సిపిఎం నాయకులు


దీక్షాశిబిరంలోనే రాత్రి నిద్రించిన పేదలు

వ్యక్తి దారుణహత్య

చిలమత్తూరు : పొలం పనులు చేస్తున్న వ్యక్తిని వేట కొడవలితో అతి దారుణంగా హత్య చేసిన ఘటన చిలమత్తూరు మండలం సోమగట్ట రెవెన్యూ పొలంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాలు... చిలమత్తూరు మండలం సోమగట్టలో వడ్డే నాగరాజు (35) దారుణ హత్యకు గురయ్యారన్నారు. పొలం పనులు చేస్తున్న నాగరాజును ద్విచక్ర వాహనంలో వచ్చిన ముగ్గురు వ్యక్తులు వేట కొడవలితో అతి దారుణంగా నరికి హత్య చేశారు. సంఘటన స్థలంలోనే వడ్డే నాగరాజు మృతిచెందాడని అటుగా పొలాల వైపు వెళ్లిన గ్రామస్తుల సమాచారంతో సంఘటనా స్థలాన్ని సందర్శించిన పోలీసులు ప్రాథమికంగా విచారించారు. ద్విచక్ర వాహనంలో గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు వచ్చి వేటకొడవళ్లతో నరికినట్లు వారి విచారణలో వెల్లడైంది. నిందితులు కర్నాటక వైపు వెళ్లినట్లు గ్రామస్తులు ద్వారా సమాచారం అందిందని పోలీసులు తెలిపారు. మృతుని తండ్రి శివప్ప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సిఐ వేణుగోపాల్, ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

ఘర్షణలో వ్యక్తి మృతి

కనగానపల్లి : మండల పరిధిలోని సోమరవండ్లపల్లిలో గురువారం రాత్రి ఇరుగు పొరుగువారు ఘర్షణ పడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు... సోమవారవాండ్లపల్లికి చెందిన బొగ్గు శ్రీరాములు (48) భార్య రామలక్ష్మమ్మ తన ఇంటివద్ద బట్టలు ఉతికింది. బట్టలు ఉతికిన నీరు దిగువన ఉన్న చాపల లక్ష్మన్న ఇంటివద్దకు వెళ్లాయి. దీంతో ఈ రెండు కుటుంబాల వారు ఘర్షణ పడ్డారు. ఘర్షణ అనంతరం బొగ్గు శ్రీరాములు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆయన్ను చికిత్స నిమిత్తం ఎగువపల్లి ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స అనంతరం ద్విచక్ర వాహనంలో ఇంటికి వస్తుండగా మార్గ మధ్యంలో శ్రీరాముల కిందపడి సృహ కోల్పోయాడు. వెంటనే అతన్ని మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందారు.

అత్యాచారానికి పాల్పడ్డాడని వ్యక్తికి దేహశుద్ధి

పోలీసులకు అప్పగింత

చిలమత్తూరు :మండల పరిధిలోని నల్లరాళ్లపల్లి గ్రామంలో 13 ఏళ్ల బాలికపై 35 ఏళ్ల వ్యక్తి అత్యాచార యత్నానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ గ్రామస్తులు అతనికి దేహశుద్ధి చేశారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు గ్రామానికి చేరుకుని నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. గ్రామస్తులు పోలీస్‌స్టేషన్ వద్దకు పెద్ద ఎత్తున చేరుకుని అత్యాచారంకు పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిరసనకు దిగారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

రొద్దం : మండలంలోని పెద్ద గువ్వల పల్లి గ్రామానికి చెందిన పింజిరి బాబయ్య (65) గుండెపోటుతో బస్సులో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి, వైసిపి నాయకులు మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే బికె పార్థసారథి, టిడిపి నియోజకవర్గం అధ్యక్షులు చిన్నప్పయ్య, తదితరులు మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. అదేవిధంగా వైసిపి నాయకులు రొద్దం ఎంపీపీ, చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ అంజిన రెడ్డి మృతుని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈసందర్భంగా వైస్ ఎంపీపీ 5వేల రూపాయలను బాధితులకు అందజేశారు.

కళ్యాణ మండప నిర్మాణానికి భూమిపూజ

పుట్టపర్తి అర్బన్ : పట్టణంలోని కర్నాటక నాగేపల్లికి వెళ్లే రహదారి పక్కన గంగపుత్ర కళ్యాణ మండప నిర్మాణానికి జిల్లా బెస్త సంఘం నాయకులు బుధవారం భూమిపూజ చేశారు. సుమారు రెండు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న కళ్యాణ మండపానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో కళ్యాణ మండపాన్ని ఏర్పాటైతే బెస్తలు వివాహాలు, వేడుకలకు నిర్వహించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. బెస్త సంఘం ఆధ్వర్యంలో దాతల సహాయ సహకారాలతో నిర్మించాలని ముందుకు వచ్చామన్నారు. ఇంకా దాతలు ఎవరైనా ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు బయన్న, అధ్యక్షులు జ్యోతి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి కేశవ, గౌరవ సలహాదారులు మాజీ మున్సిపల్ చైర్మన్ బెస్త చలపతి, నాయకులు సాయిరాం, జ్యోతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పింఛను కానుక కింద జిల్లాలో 2 ,66,045 మందికి లబ్ధి

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో వైఎస్ఆర్ పింఛను కానుకలో 2,66,045 మందికి లబ్ధి పొందుతున్నారని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ నరసయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రూ.73.82 కోట్లు పింఛన్ మొత్తం ప్రతినెల 1వ తేదీన వాలెంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పంపిణీ చేస్తున్నామన్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వృద్ధులకు పింఛన్లు పొందుతున్నారన్నారు. గతంలో మాదిరి పింఛన్ కోసం గంటలు తరబడి రోజుల తరబడి వేచిచూసే కష్టం తప్పిందన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

కదిరి అర్బన్ : రాష్ట్రంలోని ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వం వైసిపి ప్రభుత్వమని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్ధారెడ్డి చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలో గల ట్యాంక్ రోడ్డు సచివాలయం, 7వ వార్డు పరిధిలోని పోస్ట్ ఆఫీస్ లైన్, సిమెంట్ బ్రిక్స్ లైన్, అడపాల వీధి, చర్చ్ లైన్‌లో బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

పదిలో మెరుగైన ఫలితాలు సాధించాలి

హిందూపురం : ఏప్రిల్ 3 నుంచి జరిగే 10వ తరగతి వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని ఎంపిడిఒ నరేంద్ర, ఎంఇఒ గంగప్ప సూచించారు. బుధవారం రూరల్ మండలం తూమకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థులకు మోటివేషనల్ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతు విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శాంతమ్మ, అశ్వర్థప్ప తదితరులు పాల్గొన్నారు.


పరికరాలను అందజేస్తున్న దాత మాజీ సైనికుడు


మున్సిపల్ కార్యాలయానికి పరికరాల వితరణ

ధర్మవరం టౌన్ : పట్టణంలోని రాంనగర్‌కు చెందిన మాజీ సైనికుడు సతీశ్ మున్సిపల్ కార్యాలయానికి ఎలక్ట్రికల్ పరికరాలను బుధవారం వితరణ చేశారు. రూ.25వేలు విలువ చేసే ఎలక్ట్రికల్ పరికరాలను స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మల్లికార్జునకు దాత సతీశ్ అందజేశారు. మున్సిపాలిటీలో పనిచేసే కార్మికులకు ఈ పరికరాలు ఎంతో ఉపయోగపడతాయని కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ ఈఈ సత్యనారాయణ, డీఈ వన్నూర్ స్వామి, ఏఈలు ప్రతాప్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

పంటపొలాల పరిశీలన

ప్రజాశక్తి-హిందూపురం

రూరల్ మండలంలోని మణేసముద్రం గ్రామానికి చెందిన రైతు క్రిష్టప్ప పొలంలో సాగు చేసిన మొక్కజొన్న పంటను వ్యవసాయ శాఖ ఎడి అల్తాఫ్ ఆలీ ఖాన్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కజొన్న పైరుకు వచ్చిన తెగులను గుర్తించి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతుకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ శ్రీ రామ సుబ్బయ్య, ఎఇఒ శంకర్ తదితరులు పాల్గొన్నారు.


పంటకు ఆశించిన తెగులు గురించి వివరిస్తున్న ఎడి అల్తాఫ్ ఆలీఖాన్

బడ్జెట్లో రాష్ట్రానికి మొండిచేయి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఏపీకి మరోసారి అన్యాయం జరిగిందని కేంద్రం తన రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్రానికి మొండిచేయి చూపిందని సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ విమర్శించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదా, వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రకు ప్యాకేజీలు, 11 రకాల విద్యాసంస్థల నిధుల అంశం కానీ ప్రస్తావనే లేదన్నారు. పోలవరం ప్రాజెక్టు నిధుల ఊసే లేదన్నారు. ఏడాదికి కోటి ఉద్యోగాలు హామీ ప్రస్తావించలేదని, రైల్వే బడ్జెట్ రూ. 450 కోట్లు ప్రవేశపెట్టినా పేదలకు, సీనియర్ సిటిజనులకు ఇచ్చే రాయితీ తొలగించడం దారుణమని అన్నారు. టికెట్ ధర కూడా అత్యధికంగా పెంచారన్నారు. మొత్తంమీద ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్‌లో తీరని అన్యాయం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎపిపై కేంద్రం సవతిప్రేమ ప్రదర్శించిందని విమర్శించారు. త్వరలో ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు ఓ విధంగా ఎపికి మరో విధంగా కేటాయింపులు జరిగాయన్నారు.

చెక్కు పోగొట్టుకు పోయినది

సాదిరి జయ లక్ష్మమ్మ W/o రామప్ప అను నేను మా ఇంటి పై కప్పు కూలి నాకు కాలు విరిగినది. నేను అనంతపురంలోని సవేరా ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాను. నేను సి.ఎం. రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయగా నాకు రూ.50,000/-లు చెక్కును అందించారు. దానిని నేను ఎక్కడో పోగొట్టుకున్నాను. దీనిపై నేను స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. దయచేసి ఎవరికైనా ఈ చెక్కు దొరికిన యెడల నా సెల్ నెంబర్‌కు సంప్రదించండి.

సెల్:9490360048.


నిరసన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి పల్లె, తదితరులు

రాష్ట్రాన్ని నట్టేట ముంచిన వైసిపి : మాజీ మంత్రి పల్లె

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని నట్టేట ముంచిందని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి విమర్శించారు. మండలంలోని కొండకమర్ల గ్రామపంచాయతీలో బుధవారం నిర్వహించిన నీ ఇదేం కర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో పల్లె పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన శేషయ్యగారిపల్లి, శేషయ్య గారి పల్లి తండా, ఎస్ కొత్తపల్లి గ్రామాలలో పర్యటించి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, షఫీ అహ్మద్, రాజారెడ్డి, కిరేనాయక్, రామాంజనేయులు, జాకీర్ అహ్మద్, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు అంజినప్ప, కరుణాకర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, పార్లమెంటు తెలుగు యువత కార్యదర్శి జయ చంద్రారెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్ గంగాద్రి, మండే జి ఆరిఫ్ ఖాన్ , షాను, కొండే ఈశ్వరయ్య, శంకర తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కరాటే పోటీలకు కదిరి విద్యార్థులు

ప్రజాశక్తి కదిరి టౌన్

జనవరి 29,30 తేదీల్లో ఒంగోలులో స్టేట్ కరాటే చాంపియన్‌షిప్ సెలక్షన్స్ పోటీల్లో ప్రతిభ కనపర్చిన కదిరి విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కరాటే మాస్టర్ అక్బర్ అలీ ఆధ్వర్యంలో పాల్గొన్న జి హారిక అండర్ 17 విభాగంలో . 96 కేజీల(ఫైట్) కేటగిరిలో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించింది. దీంతో స్కూల్ గేమ్స్ జాతీయస్థాయి పోటీలకి అర్హత సాధించినట్లు కరాటే మాస్టర్ అక్బర్ అలీ తెలిపారు. అదేవిధంగా జాతీయ స్థాయి కరాటే పోటీలకు స్థానిక జైన్ స్కూల్ విద్యార్థిని భావన లక్ష్మీ అర్హత సాధించారు. ఈనెల 29న ఒంగోలులో 66 వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఒంగోలు మినీ ఇండోర్ స్టేడియం జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ఉమ్మడి జిల్లా నుంచి అండర్ 14, బాలికల -50 కేజీల విభాగంలో జైన్ స్కూల్ లో 8 వ తరగతి చదువుతున్న భావన లక్ష్మీ పాల్గొని జాతీయ స్థాయి కరాటే పోటీలకు అర్హత సాధించిందని కరాటే మాస్టర్ షాకిర్ తెలిపారు. ప్రతిభా విద్యార్థిని స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు జయగుప్త, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

క్రమశిక్షణతో కూడిన విద్యతోనే ప్రయోజనం

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ప్రతి విద్యార్థిని క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఇన్‌ఛార్జి ఎంఇఒ సుధాకర్‌నాయక్ సూచించారు. ఈ మేరకు స్థానిక మున్సిపల్ బిఎస్ఆర్ బాలికల ఉన్నతపాఠశాలలో బుధవారం సాయంత్రం పదవతరగతి విద్యార్థినులకు అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇష్టపడి చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నీలూరి వెంకటరాముడు, కేతా లోకేశ్, మాజీ కౌన్సిలర్ బీరే ఎర్రిస్వామి. పాఠశాల కమిటీ అధ్యకులు జైముతక రమణ, ఉపాధ్యక్షులు ం నూర్జాహాన్, పాఠశాల హెచ్ఎం ఉమాపతి, ఉపాధ్యాయులు రామకృష్ణనాయక్, హరిశంకర్, మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE ANANTAPUR
(In the matter of appointment of Guardian for the person of the minor E.Srilatha)
G.W OP 8/2023

Between:
1. T. Adinarayana ...Petitioners
2. T. Gangarajamma
Both are Residing DNo 26-4-3646 CS-A Chowdeswari Colony, HINDUPUR, Sri Satya Sai Dist.

And

To Whom so ever It May Concern ...Respondent

ప్రకటన

ఇందు మూలంగా యావన్మందికి తెలపడం ఏమనగా పై తెల్పిన కోర్టు నందు పిటిషనర్స్ దాఖలు వేసిన అర్జీ మేరకు పిటిషనర్ కుమార్తె E.Pavithra మరియు ఆమె భర్త ఇ.శ్రీనివాసులు ఇరువురు మరణాంతరము వీరి కుమార్తె ఇ.శ్రీలత (మనమరాలును) సంరక్షణకు గాను గార్డియన్‌గా పిటిషనర్స్‌ను నియమించుటకు గాను వీరి కుమార్తె E.Pavithra Apparels Ltd, unit 15, Thumakunta, Hindupur Rural mandal నందు టైలర్ గా పనిచేయుచు చనిపోవుట వలన వారి కుమార్తెకు Company నుండి రావాలసిన provident fund amount మరియు ఎంప్లాయిస్ deposit Linked scheme మొత్తము Amount, death benefits పిటిషనర్ మనమరాలు E.Srilata కు Company నుండి రావాడానికి మరియు Minor కు పిటిషనర్స్‌ని గార్డియన్ గా నియమించుటకు వేసిన అర్జీ మేరకు అభ్యంతరము వున్న యెడల ఈ నెల అనగా తేది:10-02-2023 ఉదయం 10-30గంటలకు వకీలు ద్వారా కానీ ప్రత్యేక్షంగా కానీ పై తెలిపిన కోర్టు నందు హాజరు అయి వారి ఆక్షేపణలు తెలుపగలరు అట్లు హాజరు కాని యెడల పిటిషనర్స్ దాఖలు చేసిన అర్జీ మేరకు కోర్టు వారు తీర్మానింతురు అని తెలపడం అయినది.

Schedule

1.Provident fund amount	Rs.50.000
2.Employer Depost linked insurance scheme	Rs.1.50.000
Total:	2.00.000

వాయిదా తేది 10-02-2023.

ఇట్లు: పిటిషనర్స్ పరం వకీళ్లు
యం.సుధాకర్, అడ్వకేట్, అనంతపురం.
మల్లికార్జున, అడ్వకేట్, హిందూపురం.